పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● ఎస్పీ శరత్ చంద్ర పవార్

పోలిస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హాలియా, జనవరి 3 : పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం హాలియా పోలిస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి కేసుల విషయమై ఎస్ఐ సతీశ్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ వాటిని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100పై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతిరోజు డంకెన్ డ్రైవ్ నిర్వహించాలని, తొంగతనాల నివారణకు పట్టణంలో ప్రతి రోజు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మిర్యాలగూడం డీఎస్పీ రాజశేఖరరాజు, హాలియా సీఐ జనార్దన్, ఎస్ఐ సతీశ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వైద్యులు అంకిత భావంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మర్రిగూడ, జనవరి 3 : వైద్యులు అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీప గ్రామాలకు చెందిన కిడ్నీ బాధితులకు మొదటి ప్రాధాన్యతఇచ్చి వైద్యం చేయాలన్నారు. అనంతరం మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ మాత్రు, తాసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ చిన మునయ్య, మాజీ జడ్పీటీసీలు పాశం సురేందర్‌రెడ్డి, మేతరి యాదయ్య, మాజీ ఎంపీటీసీలు వెన్నమనేని రవీందర్‌రావు, వెంకటంపేట బాలయ్య, నాయకులు పాల్గొన్నారు.

మర్రిగూడ(నాంపల్లి) : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సీహెచ్‌సీ గా మార్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక పీహెచ్‌సీ, మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు.

మునుగోడు : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సావిత్రిబాయిపూలే చిత్ర పటానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులిర్పించారు. అనంతరం తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో రోడ్లు భవనాలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), జనవరి3 : దేవరకొండ నియోజకవర్గంలోని 149 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.53 లక్షల విలువైన చెక్కులను శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయాల్లో సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని అన్నారు. అనంతరం నేరేడుగొమ్ము మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు జానియాదవ్, దూదిపాల రేఖ, బిక్కునాయక్, భవానీపవన్, మాజీ జడ్పీటీసీలు బుజ్జిలచ్చీరాంనాయక్, సురేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఘట్టమనేని బాబురావు

నకిరేకల్, జనవరి 2 : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు శుక్రవారం పట్టణ శివారులోనున్న లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం వద్ద లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఘట్టమనేని బాబురావు 100 స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమంలో రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్యానల్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి, ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ యానాల మోహన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎన్.రామ్మోహన్‌రావు, కార్యదర్శి వై.యాదగిరిరెడ్డి, కోశాధికారి లక్ష్మీనారాయణరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు బి.ప్రకాశ్‌రావు, కార్యదర్శి సూర్యచందర్‌రావు, కోశాధికారి శివకోటి ఆంజనేయులు, నవ్య క్లబ్ అధ్యక్షురాలు రమాదేవి, కార్యదర్శి పద్మజ, కోశాధికారి రఘునమ్మ పాల్గొన్నారు.

రేషన్ బియ్యంతో వ్యాపారం చేస్తున్న వ్యక్తిపై పీడీ యాక్ట్

● డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, జనవరి 3: మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో కొన్ని సంవత్సరాలుగా రేషన్ బియ్యాన్ని సేకరించి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన మందపాటి నరసింహారావు కొన్ని సంవత్సరాలుగా మిర్యాలగూడ ప్రాంతంలోని పలు గ్రామాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం సేకరించి ఆంధ్రాకు తరలిస్తున్నాడు. ఇతడిపై మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. గతంలో ఇతడిపై రౌడీషీట్ తెరిచారు. గతేడాది నవంబర్ 17న పలు కేసుల్లో అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేయగా బెయిల్‌పై విడుదలై మళ్లీ రేషన్ బియ్యం దందాను కొనసాగిస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తూ ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తున్న నరసింహారావుపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ వీరబాబు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నందలాల్ పవార్

సూర్యాపేట, జనవరి 3 : ప్రజలకు రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అప్పుడే ప్రమాదాల నివారణ జరుగుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం-2025 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జనవరి 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏసీ రాంబాబు, రవాణా శాఖ అధికారి సురేశ్‌రెడ్డి, ఎంబీఏ జయప్రకాశ్‌రెడ్డి, ఆదిత్య, అంజనేయులు పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ ఉర్సును విజయవంతం చేయాలి : కలెక్టర్

పాలకవీడు : ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలోని జేపీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉర్సు ఉత్సవాలపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏ శాఖల అధికారులు, ఏ విధులు నిర్వహిస్తారో సమగ్ర నివేదికను సాధ్యమైనంత త్వరగా తనకు అందించాలని ఆదేశించారు. అంతకు ముందు హుజుర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డితో కలిసి జాన్‌పహాడ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో సీఐ చరమందరాజు, తాసీల్దార్ కమలాకర్, ఎంపీడీఓ లక్ష్మి, ఎస్ఐ లక్ష్మీనారాయణ, నాయకులు గోపాల్, మోతిలాల్ పాల్గొన్నారు.

సమస్యలు తీర్చి ప్రజల మన్ననలు పొందాలి

సూర్యాపేట : సమస్యలతో వచ్చే ప్రజలకు సాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏసీ రాంబాబుతో కలసి జీపీఎస్‌సీ ద్వారా ఉద్యోగం పొందిన 47మందికి ఆయన కౌన్సిలింగ్ నిర్వహించి రెవెన్యూ శాఖలో పోస్టింగ్ ఆర్డర్లను ఇచ్చారు. పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరిండెంట్ పద్మారావు, సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి : జడ్జి శ్యామ్‌శ్రీ

హుజూర్‌నగర్, జనవరి 3 : న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని రెండో అదనపు జిల్లా జడ్జి శ్యామ్‌శ్రీ న్యాయవాదులను కోరారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో న్యాయవాదులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

మఠంపల్లి, జనవరి 3 : గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మఠంపల్లి సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సి.విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరీల్లో దరఖాస్తులను ఫిబ్రవరి-1 వరకు ఇవ్వాలని సూచించారు. 4వ తరగతి చదువుకున్న స్టడీ కండక్ట్, క్యాస్టు, ఇన్‌కం సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గరిడేపల్లి, జనవరి 3 : మండలంలోని మర్రికుంట గ్రామ శివారులో ఉన్న మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై శుక్రవారం రాత్రి ఇద్దరికి వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాలు.. చిలుకూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన కొనకంచి దిలీప్, మునగాల మండలం ఆకుపాముల గ్రామానికి చెందిన నంద్యాల ఆనంద్‌రెడ్డి బైక్‌పై గడ్డిపల్లి నుంచి గరిడేపల్లి వైపునకు వస్తుండగా మర్రికుటవంతెన దాటగానే ఉన్న మూలమలుపు వద్ద అదుపుతప్పి బైక్ విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. ఈ ఘటనలో పక్కనే ఉన్న పొలంలోకి బైక్‌తో సహా ఇద్దరు బోల్తా పడ్డారు. దీంతో వారికి తీవ్ర గాయాలు కాగా దిలీప్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108వాహనంలో సూర్యపేట ఏరియా దవాఖానకు తరలించారు. ఇదే ప్రదేశంలో గతంలో కారు బావిలో పడి ముగ్గురు మృతి చెందారు.

పారా స్పోర్ట్స్‌లో గరిడేపల్లి క్రీడాకారుల ప్రతిభ

గరిడేపల్లి, జనవరి 3 : పారా స్పోర్ట్స్ సీఎం కప్‌లో గరిడేపల్లి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. డిసెంబర్ 31 నుంచి జనవరి రెండు వరకు వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన పారా స్పోర్ట్స్ గేమ్స్‌లో గరిడేపల్లి మండలం కల్మల్‌చెర్వు గ్రామానికి చెందిన అమరారపు సైదులు, అప్పన్నపేటకు చెందిన గుర్రం నరేశ్‌రెడ్డి పారా వాలీబాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించగా, వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కుర్ర గోపి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు.

బస్ డిపో ఏర్పాటు కరపత్రం ఆవిష్కరణ

తిరుమలగిరి, జనవరి 3 : మండల కేంద్రంలో బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కడెం లింగయ్య, సభ్యులు, గ్రామ ప్రజలు ఉన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం : డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

విలేకుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ రూరల్, జనవరి 3 : కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో గంజాయి అమ్మినా, సేవించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు. పట్టణ పరిధిలోని కొమరబండ శివారులో గురువారం మునగాల పోలీసులు వాహన తనిఖీల్లో గంజాయిని తరలిస్తున్న 8 మందిని పట్టుకోగా ఒకరు తప్పించుకున్నారు. శుక్రవారం పట్టణ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీధర్ రెడ్డి నేరస్తుల వివరాలను వెల్లడించారు. ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైన చిత్రకూట సమీపంలో కుంట ప్రాంతంలో గంజాయి సాగు చేసే వారి నుంచి సీతారాం ఫంగి అనే వ్యక్తి 2కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేసి పట్టణ పరిధిలోని కొమరబండ వద్ద కొచ్చర్ల కేరీ, ప్రేమ్‌కుమార్, మహేశ్, యశ్వంత్ శబరీనాథ్, మధు, సాయి, నితీశ్, రాకేశ్‌కు అందించాడు. వారు దాన్ని బైకులపై నర్సింహాపురం గ్రామ శివారులో గల మిడ్‌ల్యాండ్ హోటల్ వెనుక గల వెంచర్ వద్దకు తరలిస్తుండగా మునగాల పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వీరిలో కొచ్చర్ల కేరీ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

మట్టి మాఫీయాపై చర్యలేవి? : బీఆర్ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న శెట్టి సురేశ్‌నాయుడు

కోదాడ రూరల్, జనవరి 3 : ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలను జరిపిన వారిపై రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. తూతూ మంత్రంగా పంచనామా నిర్వహించి చేతులు దులుపుకున్నారని కూచిపూడి గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేశ్ నాయుడు అన్నారు. శుక్రవారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారులు వస్తుండగా మట్టిని తవ్వే వారు వాహనాలను వదలి పారిపోయారన్నారు. మట్టి తరలింపునకు పాల్పడిన యంత్రాలు, వాహనాలను పోలీసులకు అప్పగించగా రాత్రికి రాత్రి అవి మళ్లీ వారి చెంతకు చేరాయని విమర్శించారు. ఇంత జరుగుతున్నా మండల, డివిజన్ రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో శెట్టి చంద్రయ్య, రమేశ్, వెంకటేశ్వర్లు, గోపి, మోహన్, సాయి, భువనచంద్ర, నరేశ్, శ్రీను పాల్గొన్నారు.

గాంధీనగర్ ఘర్షణ కేసులో ఏడుగురి రిమాండ్

సూర్యాపేట రూరల్, జనవరి 3 : పట్టణ పరిధిలోని 13వార్డు గాంధీనగర్ గ్రామ సమీపంలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద కిరాణా దుకాణం నడిపే విషయంలో జరిగిన ఘర్షణలో కేసు నమోదు కాగా శుక్రవారం ఏడుగిరిని రిమాండ్‌కు తరలించారు. వీరిలో బాలెంల శ్రీకాంత్, బాలెంల ఉమేశ్, బాలెంల ప్రశాంత్, బాలెంల నాగమ్మ, బాలెంల జానమ్మ, బాలెంల వీరమ్మ, బాలెంల వెంకన్న ఉన్నట్లు రూరల్ ఎస్ఐ బాలూనాయక్ తెలిపారు.

కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలి : పాపయ్య

అర్వపల్లి, జనవరి 3 : మండల కేంద్రం లో కటురి రాము అనే వ్యక్తిని కారణం లేకుండా చితకబాదిన ఇద్దరు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని పూలే అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదుర వీర పాపయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బాధితుడు తన ఇంటి ముందు నిల్చోగా ఇక్కడెందుకు నిలబడ్డావని పోలీసులు అడిగారని, మా ఇంటి దగ్గర నిలబడ్డానని సమాధానం ఇవ్వడంతో ఆగ్రహానికి గురైన కానిస్టేబుళ్లు తీవ్రంగా కొట్టడం కలచివేసిందన్నారు. దళితుడికి న్యాయం చేసే విధంగా బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు వైద్య ఖర్చులు భరిస్తూ పరువు నష్టం కింద రూ.10 లక్షల పరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ నక్కల సురేందర్, నరసింహ, వెంకన్న, యాదగిరి, నాగరాజు, రాములు, రమణ, రాణి, సైదులు పాల్గొన్నారు.

నర్సరీలో ఔషధ విత్తనాలు నాటాలి : డీపీఓ

అర్వపల్లి, జనవరి 3 : నర్సరీల్లో పూలు, పండ్లు, ఔషధ మొక్కల విత్తనాలను నాటాలని డీపీఓ నారాయణరెడ్డి అన్నారు. కోమటిపల్లి నర్సరీ, తిమ్మాపురం గ్రామపంచాయతీ రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఎంపీఓ గోపి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, నవీన్, రమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ పరుశరాములు, జీపీ సిబ్బంది ఉన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె

తుంగతుర్తి, జనవరి 3 : సివిల్ సప్లయ్ హమాలీలకు పెంచిన కూలీ రేట్ల జీఓను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదామ్ ఎదుట హమాలీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 3వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో గోదామ్ యూనియన్ అధ్యక్షుడు బొంకూరి ఎల్లయ్య, మల్లెపాక వెంకన్న, తడకమళ్ల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నల్లగొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి

మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి

మినిస్ట్రీ ఆఫ్ అఫైర్స్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల రక్తదానం


రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదానం చేస్తున్న రాగసుదేశ్

నీలగిరి, జనవరి 3 : మిన్నిస్ట్రీ ఆఫ్ అఫైర్స్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.రాగసుదేశ్ శుక్రవారం నల్లగొండ రెడ్‌క్రాస్ సొసైటీ భవనాన్ని సందర్శించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. తన సిబ్బందితో కలిసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పదం అలవర్చుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యూత్ వాలంటీర్లు విప్లవ్‌కుమార్, ఊర శివసాయి, జీవీ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకేబీఆర్ పైప్‌లైన్ పనులకు సహకరించాలి : ఆర్డీఓ

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 3 : ఏకేబీఆర్ లిఫ్టు పనుల్లో భాగంగా చేపడుతున్న పైప్‌లైన్ పనులకు రైతులు సహకరించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి కోరారు. శుక్రవారం ఇరిగేషన్ డీఈ నాగయ్యతో కలిసి పైప్‌లైన్ కోసం సేకరించిన భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మార్కెట్లో భూములకు ఉన్న దానికంటే తక్కువ ధర చెల్లించడంతో తాము నష్టపోతున్నామని, పరిహారం పెంచాలని కోరారు. భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం అందుతుందని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తేర సత్యనారాయణరెడ్డి, నాయకులు ఉన్నారు.

అదనపు తరగతి గదులకు శంకుస్థాపన

గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మాడ్గులపల్లి, జనవరి 3: మండలంలోని చర్లగూడెం ప్రాథమిక పాఠశాలలో రూ. 24 లక్షల సీడీపీ నిధులతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరుకైన గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నందున అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమలస్వామి, పీఏసీఎస్ చైర్మన్ గడ్డం స్పృధర్‌రెడ్డి, డైరెక్టర్ అలుగుబెల్లి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్ ఏఈ మధు పాల్గొన్నారు.

ఎడమకాల్వలో గల్లంతైన వ్యక్తి మృతదేహం

మిర్యాలగూడ రూరల్, జనవరి 3 : సాగర్ ఎడమకాల్వలో పడి గల్లంతైన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఇంజినీయర్ కార్తీక్ మిశ్ర (24) మృతదేహం శుక్రవారం గరిడేపల్లి మండలం మర్రికుంట బ్రిడ్జివద్ద లభించినట్లు రూరల్ అదనపు ఎస్ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని ఐలాపురం వద్ద బుధవారం ఈతకు వెళ్లిన ఇద్దరు ఇంజినీర్లు నీటి ప్రవాహానికి కొట్టుకు పోయిన సంతగి తెలిసిందే. వీరి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు నిర్వహించగా గురువారం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వాయర్‌లో విజయ్‌గోస్వామి మృతదేహం లభ్యం కాగా, శుక్రవారం కార్తీక్‌మిశ్ర మృతదేహం గరిడేపల్లి మండలం మర్రికుంట బ్రిడ్జివద్ద లభించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహానికి మిర్యాలగూడ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

నల్లగొండలో ఈ వేస్ట్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జనవరి 3: నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో ఈ వేస్ట్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుపై శుక్రవారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఈ వేస్ట్ ప్లాంట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి విజయ్‌కుమార్‌తో కలిసి ఆమె తన చాంబర్ సమావేశమయ్యారు. ఉపయోగ పడని ఎలక్ట్రానిక్ సామగ్రిని ఎక్కడ పడితే అక్కడ పడేయటం వల్ల పర్య